# వానకు తడిసిన పువ్వొకటి



పాలపర్తి ఇంద్రాణి

# ఇంద్రజాలం

"వినిపించు ఏదో ఒక కవితను
నిసర్గ సుందర మధుర గీతికను
అహమున ముసిరిన ఆలోచనలను
అవతలకు నెట్టి మనమున
శాంతి సమీరాలు వీచే పాటను"

Longfellow కవితకు అనువాదమనుకుంటాను — ఎవరు ఎప్పుడు చేశారో తెలియదు కానీ మనసులో పీఠం వేసుకుంది (కవిత్వం కావడానికి ఉపకరించే దినుసే ఇది). ఇందులో ముఖ్యంగా అహము, మనము అని రెండు పదాలు కనిపిస్తున్నాయి. మెదడు ఒకటే ఐనా, అందులో నానా అరలు పొరలు హృదయ ధర్మానికి, బుద్ధి సూక్ష్మతకు కారణభూతమవుతూఅందులో కవిత్వం రాస్తేది మనస్సంబంధి. ఆలోచనల్లో మునిగేది అహము. ఏకాంతంలో బరువెక్కిన హృదయం మేఘంలా వర్షించడమే కవిత్వం! హృదయం కవిత్వానికి నిలయం.అహం కేవలం ఆలోచనల వలయం. ఆలోచనలను, వడగాలులను ఆపే కవిత్వధార ఇంద్రాణి లో సజీవంగా వుంది.

"వాన చినుకు పడగానే
వేధించే ఆలోచనలు
ఎటో ఎగిరిపోతాయి
జల్లు మీద పడగానే
జడిపించే వడగాలులు
ఎక్కడో ఆగిపోతాయి"

మొదలు ఏదో ఒక కవితను వినిపించమని కోరి, చివరికి పాటను పట్టుకొచ్చాడు. ఇందులో ఆశ్చర్యపోవడానికి ఏమీ లేదు. పాటకు, కవితకు దగ్గరి చుట్టరికమే! పై పెచ్చు, వీటి మధ్య ఇచ్చిపుచ్చుకోవడాలు పరిపాటే. పాట అర్థాన్ని సంగ్రహిస్తే కవిత లయను లాక్కుంది. అర్థంలేని పాట, లయ లేని కవిత అందగించవు. పాటను కవితలోకి వంచడం, కవితను పాటలోకి దించడం అనవసరం. హద్దులను గుర్తించి

విడిగా వదిలేస్తేనే హాయి. ఈ జ్ఞానం కవయిత్రికి మెండుగా వుంది, కాబట్టి, ఎక్కడా ఎగుడు దిగుడు రాతలు కనిపించవు. ఈ సంకలనంలో, పొందికగా, పొంకంగా మనసుకు తాకే కవితలెన్నో.

"ఎంత దూరం నడచినా
వెచ్చని ఇల్లు దాపులో కనిపించదు.
దట్టమైన చీకటి తెర
దారిని మూసి వేస్తుంది
జోరుగా వీచే శీతగాలి
జుట్టుని చెదర గొడుతుంది
ఎంత దూరం నడచినా
నిప్పు సెగ జాడే కనిపించదు"
(శీతాకాలపు రాత్రి )

"రివ్వని కొట్టే శీతాకాలపు చలిగాలులు
తలుపు తట్టకుండానే వెనక్కు మళ్ళుతాయి
ఘుమ్మని వాసన జల్లే మల్లె మొగ్గలు
కిటికీలోంచి మెల్లిగా తొంగి చూస్తాయి
ఘల్లని కదిలే పెరటి చెట్ల ఆకులు
చప్పుడు చేయవద్దని గుస గుసలాడుతాయి
రైయ్యని ఎగిరే గాలి పటాలు
ముందు గదిలో నిశ్శబ్దంగా వేచివుంటాయి"
(పిల్లలు నిద్దరోతున్నారు)

ఈమె కవితల్లో తరచు క్రియలను సూచించే ఒక తరహా శబ్దానుకరణం (Onomatopoea) కనిపిస్తుంది. (ఈ విద్యకు అల్లసాని పెద్దన ఆద్యుడు, సరిపెణల పట్టి తెచ్చిన జాగిల ములను కళ్ళ ముందు నిలుపుతాడు). శబ్దాలతో దీర్ఘ సాహచర్యం నెరిపిన చిహ్నాలెన్నో కనిపిస్తాయి.

* * *

వస్తువులను నిజస్థితిలో గమనించాలంటే ఏకాంతం అవసరం..అహం మరుగున పడి మనసులో మలినాలు అడుగున చేరితే గాని, పాత్ర లోని శాతవాహనుల కాలంనాటి పాత బంగారు నాణెం కనిపించదు. కవిత్వమంటే ఏకాంత సంతకం. అటువంటివి లెక్కలేనన్ని.

"ఒక్కో పువ్వు నీళ్ళల్లో రాలుతూ
ఒక్కో వలయాన్ని సృష్టిస్తోంది
జారి పడుతున్న పూలని
జరిగి పోతున్న వలయాలని
చూస్తూ చూస్తూ చూస్తూ
కాళ్ళు వూపడం మర్చిపోయి కూర్చుండిపోతాను
టీ చల్లారి తరకగట్టిన సంగతే గమనించను"
(ఓ సాయంకాలం )

కవిత్వానికి జీవగఱ్ఱ అనదగ్గ ఏకాంతం కవయిత్రికి అనాయాసంగా లభ్యమవుతోంది.

"ఈ వేప చెట్టు కింద మౌనంలో మునుగుతాను
ఈ నీడల్లో వింత ఆకారాలని ఊహిస్తాను
ఎవ్వరైనా వచ్చి పలకరించడం నాకిష్టం ఉండదు"
(రాత్రి వీధిలో ఒంటరి )

కవిత్వమంటే ఏమిటి. ఇదో నిత్యప్రశ్న. ఛందస్సులే కవిత్వం అనేదాక వెళ్ళారు మూసకు, ప్రతిమకు తేడా తెలియని ప్రబుద్ధులు. ఛందస్సుకు స్థానమేలేదు పొమ్మన్నారు మూస లేకుండానే ప్రతిమ చేయగలమన్న ధీమా వ్యక్తం చేస్తే ఆధునిక మేధావులు. పోతే ఇవన్నీ అతివాదాలే.

ఎండాకాలం. అరణ్యంలో అర్ధరాత్రి. ఏదో తీవె వెనుక దాగిన పూవుల సుగంధం. బాటసారి హృదయాన్ని ఆవరించి, వేడెక్కిన మెదడును అమాంతం చల్లబరుస్తుంది. సరిగ్గా కవిత్వం చేస్తే పని ఇదే. పూవన్నాక ఒక నియమితాకృతి కొన్ని రెక్కలు, కేసరాలు, పుప్పొడి ఆకర్షించే వర్ణం తప్పనిసరి. అలాగని చెప్పి వాటివల్లే సువాసన

కలిగిందనడం విలోమ చింతన. అలాగే ఏ ఆకృతి లేకుండా సువాసన ఉంటుందనుకోవడం కూడా!

"పూల కొమ్మలా వంగి నడుస్తాను
పుప్పొడి అన్ని వైపులా ఎగురుతుంది
పసి మొగ్గలా ముడుచుకు పోతాను
సుగంధం లోలోపలే బందీ అవుతుంది
పూల జడలా కదలక నిలబడతాను
తుమ్మెద ఒకటి వచ్చి వాలుతుంది
మల్లె దండలా ఒరిగి నిద్ర పోతాను
దిండంతా సువాసన అద్దుకుంటుంది"
(పూవు - పిల్ల)

పూవుకు, కవితకు మధ్య అభేదాన్ని దర్శించగలిగిన హృదయగతప్రాణి ఇంద్రాణి. అందువల్ల ఏ కవితను తాకినా ఊహాగంధాలు, ఉద్వేగపరిమళాలు నిలువరిస్తాయి.

"పదాలు అటూ ఇటూ పరుగులు తీస్తాయి
అర్థాలు ఎటెటో దిక్కులు చూస్తాయి
ఆలోచనలు ముందుకి వెనక్కి వూగిసలాడతాయి
చివరికి,శూన్యంలోంచి పువ్వులు రాలుతాయి"
(కవితా జననం)

"ఈ అమ్మాయి ఎంత బాగుంది
పూలలోనే పుట్టి పెరిగినట్టుంది
పున్నాగ చెట్టు కిందే నిద్ర పోయినట్టుంది"
(ఈ అమ్మాయి ఎంత బాగుంది )

గ్రీకు సంప్రదాయంలో శిల్పం చెక్కినట్టు రాస్తే వారికే విశేష గౌరవం, మన్నన. ఆకారణంగానే, కవయిత్రి శాఫో చెల్లాచెదరైన అల్పాక్షరాలలో బ్రతికే వుంది. సకలేంద్రియములను పేరేపించగల ఈ విద్యలో ఇంద్రాణి నిష్ణాత.

“సన్న ఇసుక పైకి లేచి
సుళ్ళు తిరిగి ఎగురుతుంది
ఆకాశం వున్నట్టుండి
అనేక రంగులు మారుస్తుంది
జోరుగాలి బలంగా
జాడించి ముందుకు నెడుతుంది
కాళ్ళ కింద ఇసుక
కదిలి జారి పోతుంది”
( క్లేశం)

“ఆరేసిన బట్టలని
పైకెగర గొడుతుంది
పారేసిన చెత్తంతా
ఇంటి ముందు పోస్తుంది
కన్నె పిల్ల జడలోన
ఎండిన ఆకు దూరుస్తుంది
చిన్న పాప చేతిలోని
రంగు బూర లాక్కుంటుంది”
(గాలివాన)

పాదరసంలా జారిపోయే భావగతులను పట్టుకోవడం కవిత్వంలోనే సాధ్యం అని రష్యన్‌మహాకవి ,శాస్త్రకారుడు బ్రాడ్‌స్కీ ఉవాచ.ఈమె కవితలు చప్పున ఆకట్టుకొనేది ఈ గుణం వల్లే.

“ఇసకలో పురుగులు
పరుగులు తీస్తుంటే
మనసు పొరల్లో కదిలే
గతకాలపు గుర్తులు
గాలిలో పూరెక్కలు

ఎగురుతూ ఉంటే
రెపరెపా అల్లల్లాడే
తీరని ఆశలు”
(మరీచిక)

* * *

స్త్రీలలో ఉద్వేగాలు జాస్తి. కవిత్వ మూలాలు అక్కడే ఉన్నా, దాని వల్ల కవితాభివ్యక్తికి కలిగే ప్రయోజనం నాస్తి. కారణం: దానికి అవసరమయ్యేది రసదూరం పాటించగల నిర్లిప్త ధోరణి. అది స్త్రీలలో బహు సకృతు. కాబట్టే, Maya Angelou, Elizabeth Bishop లాంటి పేరొందిన కవయిత్రుల్లో కూడా శిల్పదోషాలు కనిపిస్తాయి. ఇక తెలుగులో రాస్తున్న కవయిత్రుల గురించి ఎంత తక్కువ మాటాడితే అంత మేలు. కవులు కూడా అదే బంతిలో భోజనాలు కానిచ్చి చేతులు కడిగేసుకుంటున్న వారే. దొందు దొందే అని తాత్పర్యం.

ఇంతటి ఉక్కపోత నడుమ ఋతుపవనాలు వచ్చి తాకి నాలుగుచినుకులు రాల్చడం నిజంగా ఇంద్రజాలం. ఇది ఇంతటితో ఆగకుండా కుంభవృష్టిగా మారి, పెను ఉప్పెనై విరుచుకు పడి, పేరుకుపోయిన నానావాదాల చెత్తను మిగల్చకుండాఊడ్చి, కొత్త కవిత్వ శకానికి నాంది పలికితే ఆంధ్రసారస్వతానికి అంత కన్నా కావలిసిందేమీ లేదు.

తమ్మినేని యదుకుల భూషణ్
న్యూజెర్సీ, 11 జూన్2005

# ఆధ్యాత్మికం

శీతా కాలం తోటలో
నేను పచార్లు చేస్తున్నప్పుడు
కీటకాలు గాలిలో
యోగాసనాలు వేస్తుంటాయి
పిట్టలు కొమ్మల మీద
వేదాంత చర్చలు చేస్తుంటాయి

ఎండా కాలం గొడుగులో
నేను నడుచుకు పోతున్నప్పుడు
చెట్లు ఎండలో
సూర్య నమస్కారాలు చేస్తుంటాయి
ఎద్దులు బాట పక్క
జపమాలలు తిప్పుతుంటాయి

వానా కాలం ఇంటిలో
నేను ముడుక్కు కూచున్నప్పుడు
పువ్వులు వానలో
దేవతల భాష మాట్లాడుతుంటాయి
అరుగులు ఆనంద భాష్పాలతో
సాష్టాంగ పడి ప్రార్థిస్తూ ఉంటాయి

# ఆనంద్

వేసవి మండుటెండలలో
వగరు వేడి గాలులలో
వంపుల పూల బాటలలో
వడివడిగా ఎదురొచ్చే ఆనంద్

సాయంకాలపు వేళలలో
సన్నజాజుల వాడలలో
సరుగుడు తోపుల దారులలో
సవ్వడి చేయక సాగే ఆనంద్

చుక్కలు పొడిచిన రాత్రులలో
చక్కిలిగింతల వెన్నెలలో
చేవుంతుల విరి తోటలలో
చప్పుడు చేయక నిలిచే ఆనంద్

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=890**

* * *